శ్రీ వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు

శంకుస్థాపన

"కొంపతీసి ఫౌండేషను ష్టోను అలాటో ఏయిస్తున్నామను కొన్నారేమిటి మేష్టారూ?" అన్నారు స్వింగ్‌డోరు తోసుకొని ఆఫీసు రూంలోకి వొస్తూ సమితి ప్రెసిడెంట్ గరికయ్యగారు. అతనోట్టిబాటు ఊరి సర్పంచ్ తవిటయ్యా, బి. డి. ఓ.లు కూడా లోపలికొచ్చేరు.

ప్రిన్సిపాల్ చటుక్కున ఓసారి సీట్‌లోంచి లేచి కూర్చుంటూ "కూర్చోండి కూర్చోండి. అలా ఎలా అనుకుంటాను చెప్పండి! ఆ ప్రక్క హైస్కూలు గదులూ, ఈ ప్రక్కన కాలేజీ షెడ్‌లూ; ముందువైపు గేటూ, వాలీబాల్ కోర్టులూను! ఇప్పటికే కన్జెస్టెడ్‌గా వుండగా ఎలా కుదురుతుందనుకొంటాను! అయితే..." అని ఇంకా ఏదో అనబోతూండగానే తవిటయ్య అందుకొన్నాడు –

"అయితే గియితే అంటారేటి మేట్టారూ? నానెంత నిదానించి సెప్పినా మీకేటి ఇసిదం కానట్టున్నాది! నేకపోతే యేటి సెప్పండి–ఎల్లుండీ కాడికల్లా మినిస్టరు పారొచ్చేత్తుంటే ఇయ్యేల దాకా నాను మీకు సెప్పిన వొక్క అరేంజిమెంటు కూడా కంపిలీటు కానేదు."

ఇంతట్లోనే గరికయ్య అందుకొన్నాడు-"అసలు మీరెందుకు సందేహిస్తున్నారో నాకేం తెలీడంలేదు. మేమే పీకించేద్దుం దాని పాక. అయితే ఇదిగో ఈ తవిటయ్యమీద ఇప్పటికే లేనిపోని నాన్సెన్స్ ప్రోపగండా వుంది. ఇప్పుడుగాని మేం డైరెక్టుగా రంగంలోకి దిగితే లేనిపోని సెడ్డపేరు కొనితెచ్చుకున్నట్టవుతాది. అందుకని మీకు పురమాయించేను అయితే మేమంతా మీకు ఎనక సపోర్టుగా వున్నట్టే కదా!"

ఇంతట్లో బి. డి. ఓ. కలగజేసుకొంటూ-"అంకాలు దగ్గిర ఈ సరౌండింగ్స్‌లో గుడిసె కట్టుకోడానికి పెర్మిషన్ గ్రాంటుచేస్తూ మేనేజిమెంట్ ఇచ్చిన ఆర్డరు ఉంటుంది కదా! అది చూపించి గొడవ చేస్తుందని ప్రిన్సిపాల్‌గారు జంకుతున్నారేమో!" అన్నారు.

"ఆర్డగా! పాడా? అదేటినేదు. ఆ మాటకొస్తే ఆ యెదవ నంజకి హక్కేనేదు. దాని మొగుడిని నైటోచరుగా యేసినపుడు యేదో వుత్తి పున్నేనికని 'వో గుడిసేసుకోరా!' అని నోటిమాటిచ్చినాం. అంతే మరేటినేదు. ఆడు సచ్చినాక ఆ యేకెన్సీలో తలుపులుగాడిని యేసినాం. ఆడు వూళ్లో పెళ్ళాం కొంపకాడే నివాసం యెట్టుకొని, రాతిరేల వొరండామీద తొంగొని గస్తీకాస్తుండు. దాని మొగుడు సచ్చిన్నాడే ఆ దొంగనంజని తగిలేసినాం కాదు. ఏటో వుత్తి పున్నేనికని గరికయ్యగారు ఆళ్ళమాటా ఈళ్ళమాటా కాదన్నేక దీనికి సీపరు పోస్టొటి యిచ్చేసినారు. ఇయ్యేల కా నంజకూతురు కొదమకోసం కొట్టిన గుంజనాగా యిక్కడ పాతుకుపోయి కదల్నన దేటి?" అని తవిటయ్య అంకాలుపై తనకున్న అక్కసంతా వొక్కసారి కక్కేసరికి గరికయ్య –

"నీకీ మాటతీరూ ఫోర్సూ ఎప్పుడు తగ్గితే అప్పటిగ్గాని రైజ్‌లోకి రావనుకో! ప్రాణం తీస్తున్నాసరే అలా బూతులో తిట్టచ్చా–అందులోనూ సర్పంచివి, నోటిదురుసుతనం తగ్గించుకోవద్దూ" అని, ప్రిన్సిపాల్‌వైపు తిరిగి–"అప్పుడేదో అయింది. ఏదో పిల్లల్దిగదా అని వూరుకొన్నాం. ఇప్పుడు దాని కూతురు పెళ్ళై ఈ వూళ్లోనే కాపరం చేస్తోందిటకదూ! అక్కడికి పొమ్మనండి! అదెక్కడికిపోతే మనకేటి గానీ – ఇవాళ సాయంత్రానికల్లా ఇసక లారీలూ, ఇటికలూ, సిమ్మెంటూ–మొత్తం అన్నీ కంప్లీటుగా వొచ్చి పడిపోతాయి. రాత్రికి రాత్రి పన్లన్నీ అయిపోవాలంతే. అంచేత అప్పటికి ఆ సైటంతా క్లీన్‌గా చదునుగా వుండితీరాలి–ఇక ఆ వర్క్ గురించి ఆపి, ప్రెస్సువర్కు గురించి చూద్దాం. మరి సన్మాన పత్త్రం నేను సెప్పినట్టల్లా రాసి పెట్టేరా? ఆ పజ్యాలు రాయించేరా? రేపు పొద్దున్న పదింటికల్లా టౌనులో ప్రెస్‌కి అవన్నీ వెళ్ళిపోతేగాని వీల్లేదు-ఇంకా చాలా చాలా తంతుంది" అంటూ సిగరెట్ వెలిగించేడు.

"అవన్నీ రడీగనే వున్నాయి" అంటూ ప్రిన్సిపాల్ డ్రాయరు సొరుగులోంచి ఓ ఫైల్ తీసి గరికయ్య కందిస్తూ 'స్టాఫ్‌లో కొందరు అంకాలువైపు మొగ్గుతారు. మరి వాళ్ళని నేను కొంచెం కాసుకోవాలికదా – అందుకనే కొంచెం ఆలస్యమైంది. ఇవాళ సాయంత్రం నాలుగ్గంటలకల్లా వెకేట్ చేసి వెళ్ళిపోతోంది" అన్నారు పేపర్ వెయిట్‌ని యాదాలాపంగా అటూ ఇటూ దొర్లిస్తూ.

ఫైల్లో కాయితాల్ని అటూ ఇటూ తిరగేస్తూ గరికయ్య "ఈ పజ్యాల సంగతి నాకేటి తెలుస్తాదిగాని–చూడండి ఈ సన్మాన పత్త్రం నేను చెప్పినట్టు అస్సలు మీరు రాయలేదు! నేనొక్కణ్ణేనా? అటు ఎం. ఎల్. ఏ. గారూ, ఇటు సబ్ కలెక్టరుగారూ కూర్చున్నాకే అనుకున్నాం. ఆ మాటలే మీకు రాసిచ్చేను. అసలు మేటరెలా వుండాలో చెప్పేను అసలా మాటలుగాని, మేటరు గాని వుంటేనా ఇందులో!––ఇవన్నీ ఏవిటండీ? అసలు మొదటిలైన్లోనే శంకుస్థాపన అని రాసేసారేంటండీ మరీను! కాకి వొత్తుండదుటండి! అది దిద్దేయండి. మరి అదేదో సెంద్ర సిలా ఫలకం అని రాసిచ్చేను కదండీ. మీరేమో సలవరాతి పలక అని రాసేరు! – ఇలా

రాస్తే నేనేమై పోవాలో చెప్పండి. ఔను ఇదేవిటిది? బిల్డింగు కావాలనీ, లెక్చరర్లు సరిపోరనీ ఎవరు రాయమన్నారు సెప్పండి! అసలు నా ప్లాన్ మీకు బోధపడలేదు మేష్టారూ! నేను సెప్పిం దేవిటి—సీనియర్ కాలేజీకి అప్రూ సేయించమని మనివి సేయాలని! ముందస్తుగా జరగాల్సిందదీ. అదంటూ జరిగినాక – ఇంకేవుంది ఆటోమేటిక్కుగా మీరిప్పుడు రాసినవన్నీ మనం మనివి సేయకుండానే ఫైసలా అయిపోతాయన్నమాట! ఇక ఇయన్నీ యెందుకు రాయడం? తీసేయండి. నేను చెప్పినట్టే కంప్లీటుగా మార్చేసి రాతిరి పదేలోగా నాకు అంపేయండి'' అన్నాడు.

ఈ మాటలకి చెమటపట్టే స్థితికొచ్చిన ప్రిన్సిపాల్ ''మరేంలేదు—నాకు ఇంగ్లీషులో చెయ్యి తిరిగినట్లు తెలుగులో తిర గదు. అందుకని తెలుగు లెక్చరర్‌ని వ్రాయమన్నాను. అవన్నీ సరి దిద్దింది మీకు ఆరోగంట అయేసరికల్లా పంపించేస్తాను'' అన్నారు.

''మరి నేను వెళ్ళి మిగతా పనులు చూసుకొంటాను. రేపీ పాటికి ఆరు నూరైనా నూరారైనా సరే అంతా రడీగా వుండాలి. మీ హెల్ప్ కోపరేషనూ మేమేమీ చేయలేం మేష్టారూ! మరి వెళ్దామా!'' అని మిగతా వాళ్ళవైపు చూసేడు గరికయ్య.

''చూడండి—మరి—ఇప్పుడు వేయిస్తున్న వైట్ వాషింగ్ మొత్తం బిల్డింగ్ అంతకీ కదండీ'' అన్నారు ప్రిన్సిపాల్ గరికయ్యనీ తవిటయ్యనీ కలిపిచూస్తూ.

''ఇప్పుడెక్కడౌతుందండీ! ఏదో ఈ పనిలో పనిగా కాలేజీకి కంప్లీటుగా సున్నాలు వేయిస్తే బాగానే వుంటుందనుకోండి. కానీ ఎక్కడికని? ఇప్పటికే వోవరెష్టిమేషనైపోయి కూచుంది. ఈ పని అయేసరికల్లా ఎలా లేదన్నా మూడువేల పై చిలుకుమాటే! ఎంత కని తేడం—ఎవర్నడిగితేడం? పోనీ ఏ అక్కౌంటులోనో గోకిద్దా మంటే కొంపలంటుకుపోతాయి. అసలే రోజులేం బాగులేవు. ఏదో కానిద్దురూ—ముందు కనిపించే గోడలికి వేసేరుకదా!—అయినా మిని ష్టరుగారు మేం చెప్పినట్టల్లా నడుచుకుపోవలిసిందే! తెలిసిందా మేష్టారూ!'' అని వోమారు గరికయ్య అందరి మొహాల్లోకీ చూసి, సంతృప్తిగా చిరునవ్వు నవ్వి లేస్తూ ''అంచేత మేష్టారూ— ఇప్పటికిలా కానీయండి. నిదానంగా దరిమిలా చూసుకొందాం. మరి మేం వొస్తాం మాష్టారూ'' అంటూ లేచేడు. అతనితో మిగతా ఇద్దరూ కూడా లేచి వెళ్ళేరు.

అవతల జీప్ స్టార్ట్ అయిన శబ్దం వినిపించగానే ప్రిన్సిపాల్ అటెండర్ చేత తెలుగు లెక్చరర్‌ని పిలిపించి 'ఏవిటి మేష్టారూ మరీ అంత శ్రద్ధతీసుకోకుండా వ్రాస్తే ఎలా చెప్పండి ? – శంఖు స్థాపన అని వ్రాయాలి కదండీ. మీరా పదాన్నివాడిన రెండుచోట్లా మా లు కా యే వ్రాసేరు! మీరు స్టాఫ్‌నీ, ఎకామిడేషన్‌నీ ఇన్‌క్రీజ్ చేయమంటూ రాసేరు బా నే వుందనుకోండి. కాని, ఆ విషయాలమీద గరికయ్యగారికీ వాళ్ళకీ ఏ ఇంటరెస్ట్ అస్సలు లేదు. అంచేత కొంచెం అది డ్రాప్‌చేసి, సీనియర్ కాలేజీకి పెర్మిషన్ గ్రాంట్ చేయమనే మేటరుపై ఫోకస్‌చేస్తూ వ్రాసేద్దురూ.

అన్నట్టు అసలు సంగతి మర్చిపోయేను – చూడండి – వాళ్ళు చలవరాతి పలక అని కాక చంద్రశిలాఫలకం అనే పదాన్నే వాడ మంటున్నారు. ఈ క్లారిఫికేషన్స్ చేసి మీరు కాలేజీ వదలివెళ్ళేలోగా నాకీ కాయితాలిచ్చేయండి'' అంటూ ఫైల్‌లోంచి కాయితాలు తీసి అతని చేతికిచ్చేరు.

కాయితాల్ని తను అందుకొనీ అందుకోడంతో ఇష్టం వొచ్చినట్లు చింపి ఉమ్మచుట్టి వేస్ట్‌బకెట్‌లోకి గిరాటేస్తూ—

''సారీ కాస్తంత బుద్ధి గడ్డితిని ఏదో మీరు చెప్పేరని – కేవలం మీమీద వున్న రిగార్డ్‌కొద్దీ జీవితంలో ఏనాడూ రాయని ఈ రాతలకు సిద్ధపడ్డాను. క్షమించండి—నాకు చేతకాదు. ఆ పద్యాలు వ్రాయించేరుగా వాళ్ళెవరినో వ్రాయమనండి—వొస్తాను'' అంటూ లేవబోతున్న తెలుగు లెక్చరర్ ప్రవర్తనకి షాక్ తిన్న ప్రిన్సిపాల్ సర్దుకొంటూ—

''కూర్చోండి వెంకట్రామయ్యగారూ! మిమ్మల్ని ఏదో అవమానించాననుకోకండి! అయినా ఇందులో ఏముంది – ఏదో వాళ్ళన్నట్లుగా రాసిచ్చేస్తే సరిపోతుంది గదా! వాళ్ళకే తెలీక పోవచ్చు. ఐతే వాళ్లకి నచ్చజెప్పేకన్నా అలా రాసిచ్చేస్తేనే సరిపోతుంది గదా – అలా రాసిచ్చేద్దురూ!'' అన్నారు.

''నన్ను మీరు రాయమన్నారు – నాకు తోచిందీ; కాలేజీ అభివృద్ధికి ముఖ్యావసరమని నాకు అనిపించిందీ కేవలం మీ మాట తీసేయలేకే వ్రాసేను. దాంట్లో మేటర్ మీకిష్టంలేదనీ, వర్డింగ్ బాగోలేదనీ మీరే అంటూ ఇంకా అవమానించలేదంటారేమిటి ?!— ఇక్కడ ఈ విద్యాసంస్థలోని ఒక వ్యక్తి రాతని, ఈ ఇన్‌స్టిట్యూషన్ అభివృద్ధిని మనసారా కోరి రాసిన రాతని ఎవడో కౌన్‌కిస్కా మీయెదురుగ పెన్ పుచ్చుకు అండర్‌లైన్ చేసి మరీ మార్చేయ మంటాడా ? పోనీ నిజంగా ఏదో పొరబాటు దొర్లితే నేను శిరసా వహిస్తాను. ఆ మిడిమిడి జ్ఞానం వాళ్ళకి తెలీకపోడం వింతకాదు – కనీసం మీరన్నా ఈ సంగతి గుర్తించి ప్రవర్తించకపోడం నిజంగా నారాత ! -- సారీ – నేను వ్రాయను'' అంటూ వెంకట్రామయ్య ఛట్టున లేచేరు.

''వొక్కసారి మీరెవర్ని కౌన్‌కిస్కా అన్నారో గుర్తిస్తే మంచిదేమో !''

''ఏం బెదిరిస్తున్నారా! ఎవడైతే నాకేం! – నన్ననవసరంగా వేడెక్కించకండి. వెళ్ళిపోయేముందు వో మూడు వాక్యాలంటున్నా వినండి ఇదేం ఆ కౌన్‌కిస్కా అన్నదానికి ఏదో అయి రుజువుచేసుకో డానికి అనుకొనేరు కేవలం మీకోసమే చెప్తున్నా – శంకువు అంటే మంత్రయుక్తంగా పునాదిలో తొలిగా స్థాపించే వో చిన్నకఱ్ఱ! అంతే గాని శంఖమూ కాదు మరోటీ కాదు. ఇక—చంద్రశిలాఫలకం ఏమిటి వాళ్ళ పిండాకూడు! స్పష్టంగా అందరికీ అర్థమయేలా అందరూ వాడేమాట రాస్తే ఏం చిన్నతనంగా వుందా ? ఏం ఇంతగా సంస్కృత పదంలో నిండుతనాన్ని చూసిన మొహాలేనా అలా

ప్రయోగశాల అన్న పదానికి అండర్లైన్ చేసింది ? ఏం ఆ అందరూ వాడే సంస్కృతపదం కన్నా లేబరేటరీ హాల్ అనే పదమే డిగ్నిఫైడ్‌గా వుంది గాబోలు ! ఇలా అఘోరించే వాళ్ళుండబట్టే 'మాకు ఇంగ్లీషే నయం — తెలుగొద్దు' అనే వాళ్ళు తయారౌతున్నారు. ఇక ఆ మూడో సంగతి — మేటర్ గురించి ! దాని గురించి మీకు ఇప్పుడు ఎలా చెప్పినా అర్థంకాదు — భావిలో మీకే తెలుస్తుంది'' అంటూ వెంకట్రామయ్యగారు వెళ్ళిపోయేరు.

అవాళ రాత్రి వెంకట్రామయ్యగారు భోంచేసి పేపరు తిరగేస్తుంటే అంకాలు మనవడిని బుజాన వేసుకు వొచ్చింది.

''ఏం అంకాలూ ఇలా వొచ్చేవ్ ! అన్నం తిన్నావా లేదా ? ఏవిటి నీ యజమాని పేరింటిగాడనేమిటి బుజానవేసుకు మనమడిని వొదలవు. ఆఁ కూతురింట్లోకి మకాం మార్చేవట !''

''మరే కాడికి పోతాను సెప్పండి బాబూ! పెదబాబుగోరూ, పెసిడెంట్‌బాబూ వొకరేటి అంతా కుమ్మక్కైపోనారండి· నా కొంప పీకేసి నన్నీదినాడేసినారండి. నానే కాడికి పోతానండి!— — ఆడెల్లేయెల్లిపోనాడు. నానీ కౌకులొట్టుకున్నాయండి. మీరూ ఆ ఆచేరిబాబూ నన్నేటి బగవంతున్నాగా కనికరించినారండి. నన్నెన కేసుకొచ్చి అళ్ళకీ ఒఁగాళ్ళకీ యినుకొనేట్టు సేసి నాకీ నవుకురీ యేయించినారు. ఏటి మీరిద్దరూ యెనకేసుకు రాపోతే నానేటి— నా అమ్మి వో అయ్యకాడికెల్లడం కల్ల సూతానేటండి! నిజేనికి మీరే దాన్నో యింటిదాన్ని సేసేసినారండి. ఈ సర్పంజీగాడో పింజారీ యెదవండి. నా వొంటిమీద కన్నేసి యెంతేడిపించినాడండి, ఆడికి నొంగనేదని కడుపులో యెట్టేసుకు నా నవుకిరీ వూడగొట్టసూణ్ణేదుటండీ. యేదో అయిపోనాది. నా బుడ్డోడూ నానూ గుడిసెలో కూకుని కుసింత గంజి తాగుతుణ్ణాం గందా అని నానెంతో మురిసిపోతన్నానండి. ఈ కాడికి పింజారీవోడికీ బుద్ధి పుట్టినాది. వుత్తకంత్రీనాకొడుకండి నానుగాని నా బొట్టిగాని ఆడికి నొంగనేదనే కడుపులో యెట్టేసుకు పెదబాబుగోరికి యేటేటో సెప్పేసి నాను గుడిసొగ్గేదాకా తెగ గింజుకు సచ్చిపోనాడండి — నా వుసురు తగల్దేటి'' — ఏడుస్తూ అంకాలేదో గొణుగుతోంది.

''ఊరుకో ఏడిస్తే ఏం వొస్తుంది చెప్పు ! అంతమంది కలిసి నిన్ను గెంటేస్తే ఏం చేయగలవులే ! అవునుగానీ నీ మొగుడికి నైట్‌వాచర్ గిరీ వచ్చినప్పుడు కాలేజీ జాగాలోనే ఇల్లు కట్టుకొని వుంటూ ఉద్యోగం చేయమని కాయితం ఇవ్వలేదుటే వాళ్ళు !'' అన్నారు వెంకట్రామయ్య.

''నేదండి — నానెంతో సెవినిల్లు కట్టుకు అలా కాయితం పుట్టించుకోరా అని తెగ సెప్పినానండి. ఆడేటి యినుకొనేరకమేటండి — యియ్యాల కదే నా కొంపతీసినాదండి. యేటి సేత్తరో మీరూ ఆసేరిగోరూ పూనుకోవాల. అళ్ళంతా యినుకొనేటట్టు సెప్పి మల్లా నాగూడు నాకు నిలబెట్టాల. కానీజీకి యెనక తట్టైనా నాకేటి యిరకాటకపూఁ యిబ్బందీ నేవండి. ఏదో ఆ కాడికే యింత కమ్మ నేసుకు పడుంటాను.''

''నీ తెలివి తెల్లారినట్టే వుంది. కాలేజీకి వెనకాతలా ! అంటే రేపొద్దున్న గోడౌన్స్ కట్టబోయేచోట ! పంచాయతీ జాగాలో నీకు చోటిస్తాడే సర్పంచ్ ! ఇచ్చినా ఆ ఆరుబయట ఎక్కడా కనుచూపుమేరలో ఓ గుడిసైనా కనిపించనిచోట నువ్వెలా ఉంటావే?- ఏదో సైన్సు మేష్టారితోబాటు ఆలోచించి చెప్తాను— అన్నం తిన్నావా ?''

''మా అల్లుడింకా డూటీనొంచి రానేదండి. ఆడొచ్చినాక యెంగిలి పడదావఁని ఒఁగా బుడ్డోణ్ణి సంకనేసుకు మీకియన్నీ ఇసిదం సేసికొందామని వో సుట్టు పొచ్చినానండి. సానాసేపైపోనాద — బేగెల్లకుంటే నాకేటి అగుపడద్దేటి ! మరి నానెల్లిపోతానండి'' అని మనవణ్ణి ఎత్తుకుంది.

''మంచిది — జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్ళు. రేపు ఏ సంగతీ చెప్తాను ఓసారి కనిపించు''అంటూ వెంకట్రామయ్యగారు లేచేరు.

మర్నాడు వెంకట్రామయ్య కాలేజీకి వెళ్ళేసరికి అక్కడంతా మహాసందడిగా వుంది. లారీలతో ఇసక తెచ్చి పోసేరు ! — ''అవును గానీ సంవత్సరం క్రితం నుంచీ ఆ ప్లే గ్రౌండులోనూ, వాలీబాల్ కోర్టులోనూ ఇసక పోయించండయ్యా అంటే వొక్కడు ఉలికితే వొట్టు ! మరి ఇప్పుడు—ప్చ్ !'' — డి. డి. టి. బస్తాలు వో రెండు వో మూల రడీగా విప్పి వున్నాయి ! ''ఈ పౌడర్ని న్యాయంగా ప్రతీరోజూ రోడ్ల కిరుప్రక్కలా కాలవలవైపు జల్లాలి గాబోలు ! ఏదో ఇవాళ్టికన్నా ఈ వూర్లో వో రోడ్డుకైనా ఆ యోగం దక్కింది !'' బిల్డింగ్‌కి ఇటువైపంతా సున్నం వేసేశారు. లారీమీద వొచ్చిన షామియానాలనీ, టార్పాలిన్‌లనీ, కుర్చీలనీ వరండామీదికి దింపి వో గదిలో పేరుస్తున్నారు. స్టూడెంట్స్ కొంతమంది బ్యానర్లపై ఏవో అక్షరాలు రాస్తుంటే; మరికొంత మంది రంగు కాగితాల్ని కత్తిరిస్తున్నారు. గేట్ దగ్గిరనుంచీ త్రోవ కటూఇటూ ఇటికల్ని కోసుగా కొట్టి పాతుతూ, వాటిపై తెల్లగా సున్నం వేస్తున్నారు.

వెంకట్రామయ్యగారు చటుక్కున దూరంగా కుడివైపు ప్రహరీవారకి చూసేరు. అసలు గుడిసెవున్న పోలికేలేకండా నేలంతా చదునుచేసి 'ఎల్' షేప్‌లో గొయ్యి తవ్వి మొదట్లో గోతిలోకి మూడు మెట్లు చెక్కుతున్నారు. దానికి కొంచెం దూరంగా — ''ఆరి ! ఏమిటప్పుడే దిమ్మ కట్టేయడం; దానికి అక్షరాలు చెక్కిన చలవరాతి పలకని తాపడం కూడా అయిపోయింది! — నిజంగా అవసరం అని అనుకోవాలేగాని—అనుకొన్నారా ఎంత పనైనా వీళ్ళు అవలీలగా చేయగలరు. ఈ శ్రద్ధలో పావువంతుశ్రద్ధ చూపినా ఈ కాలేజీ ఈ పాటికెంత అభివృద్ధి చెందివుండేదో!'' అని అనుకొంటున్న వెంకట్రామయ్యగారి దగ్గరకి —

''నమస్కారం మేష్టారూ ! వో చిన్న శుభవార్త ! ఇవాళా రేపూ మన ముష్కరుడుగారు కాలేజీలో వర్క్ సస్పెండ్ చేసేడు.

రేపటి ప్రోగ్రామ్ సర్క్యులేట్ అవుతోంది ఫుల్ సిగ్నేచర్‌లు కోరుతూ!'' అంటూ సైన్స్ లెక్చరర్ భాస్కరాచారి వొచ్చేరు.

''అయ్యో ఇవాళ మంచి పోయిట్రీ క్లాసులు ఏట్లో కలిసా యన్న మాటే!''

''ఎందుకండీ మరీ అంత వర్రీ ఐపోతారు? — మీరంటుంటారు చూడండి తామరాకుపై నీటిబొట్టులాగా అని-ఆ మెంటాలటీ ఈవిషయంలో కూడా అలవాటు చేసుకోకపోతే బ్రతకలేమండీ! మీరేమనుకోండి—నా మట్టుకు నాకు హాయిగా తేలిగ్గా వుందివాళ! పదండి వో మారలా హాయిగా ఏటి ఇసకలోంచి నడుచుకొంటూ అట్నించిరామతీర్థాలు జంక్షన్‌లో సిటీబస్‌ని క్రాస్‌చేసి విజయనగరం పోదాం. ఇవాళ సిడ్నీ పోయిటర్ టీచర్‌గా ఏక్ట్ చేసిన 'సెర్వ్ విత్ లౌ' అన్న బ్రహ్మాండమైన పిక్చర్ వుంది సిటీలో.''అన్న భాస్కరాచారి గారి మాటలు విని వెంకట్రామయ్యగారు

''సారీ-ఇవాళ వో చిన్న రాతపని పైనేసుకొన్నాను''అన్నారు.

''ఐసీ—మళ్ళాయేదన్నా ఆర్టికల్ రాస్తున్నారా!!''

''లేదండీ—చిన్న లోకోపకారం— అవునుగానీ — వోసారి ఇలా రండి'' అంటూ వాలీబాల్ కోర్టువైపు నడుస్తూ వెంకట్రామయ్యగారు ''అవునూ లేబరేటరీ అక్కడ కట్టడమేవిటండీ? కాస్టీల ఎక్విప్‌మెంట్ వుంటుంది కదా! గోడ కటువైపంతా ఆరు బయలుంది!'' అన్నారు.

''ఏమిటి మేష్టారూ మీరు మరీ అంత ఇన్నోసెంట్‌గా ఎలా వుంటారో నా కర్థం కాడంలేదు — అంతా ఫార్సండీ! గరికయ్యమొన్న ఖాళీ అయిన రిజర్వ్‌డ్ సీట్‌పై ఎం. ఎల్. ఏ గా నించోబోతున్నాడు లెండి. ఆ సీట్ గ్యారంటీగా తనకే దక్కాలనీ, తీరా దక్కేక ఖర్చులకై వీలైనంత ఎక్కువగా పార్టీ నిధి నుంచి దక్కించుకోవాలనీ, ఇక ఆపైన గెల్చేక — శాంత పాపం — అయినా చెప్పుకొనారి తప్పదు — ఏ పోర్టిఫోలియోలోనో ఇరుక్కుపోవాలనీ బ్రహ్మాండమైన ఆశాపాశాన్ని తన మెడలోని శుద్ధ పొందూరు ఖాదీ వోణీలాగా అందంగా పెంచుకుంటున్నాడు. అందుకోసమనే ప్రస్తుతం రాబోయే మినిష్టర్‌గారి హార్థిక లేక ఆర్థిక సహాయ సంపత్తులు పొందాలని ఇలా సదరు శ్రీ వారిచే ఇక్కడ ఈ శంకుస్థాపనా, అక్కడ వూరి పొలిమేరలో ఎప్పణ్ణించో వాడబడుతున్న హరిజన వాడలో కొన్ని ఇళ్ళకు ఓపెనింగ్ సెలిబ్రేషనూ, ఈ వూరి వార మన ప్రియతమ శిష్య బృందంచే శ్రమదానంతో నిర్మింపబడ్డ రెండుంబావు మీటర్ల సుదీర్ఘ గోచీపాతపంథాకు ప్రారంభోత్సవమూ దగ్గిరుండి చేయిస్తూ కాకా కొడుతున్నాడు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
(స్థాపితం 1908)
గాంధీనగరం, విజయవాడ-3
ఇంట్లో అందరికీ ఆనందాన్ని ఇచ్చే శీర్షికలు! కథలు!! బొమ్మలు!!!
★ సాహిత్య విలువలున్న సీరియల్ కథలు
★ వైవిధ్యం వున్న కథానికలు
★ అన్ని తరాలవారినీ అలరించే "ప్రశ్నావళి" "ధర్మపథం" కార్టూన్‌లు మొదలైన వాటితో ఏవారానికి ఆ వారమే కొత్తదనాన్ని పుణికిపుచ్చుకుని మీకు అందుతుంది!

విడి ప్రతి వెల 75 పైసలు
సంవత్సర చందా (పోస్టుద్వారా)
రు. 41-60 పై.

ఆరు మాసాలకు రు. 20-80 పై
మీ స్థానిక ఏజంటుద్వారా తెప్పించుకుంటే ప్రతివారం తెలారేసరికల్లా మీముందు వుంటుంది

రచనలు పంపే చిరునామా!
ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

ఇతర వివరాలకు:
మేనేజరు, ఆంధ్రపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

సందట్లో ఫందడిగా మన సర్పంచ్ ఈ కాలేజీని అమాంతం సీనియర్ కాలేజీ చేయించేసి ప్రస్తుతగ్రాంట్లనీ, డొనేషన్లనీ ద్విగుణీకృతం చేసుకు పదిలం చేసుకోవాలని యమయాతన పడుతున్నాడు. ఇక మన ముష్కరుడుగారు — పాపం వెర్రివాడండీ — కొన్ని విషయాల్లో అతణ్ణిచూస్తే జాలేస్తుంది—ముండావాడు హైస్కూల్లో మేథ్స్ అసిస్టెంట్‌గా అఘోరిస్తూ మెల్లిగా ఈ గరికయ్యని కరిగించుకొని ఈపదవి నధిష్ఠించాడు మన ఖర్మకొద్దీ. పాపం మేథ్స్ వాడు కదా—లెక్కలూ, తన జేబులో పడాల్సిన లెక్కలూ తప్ప పోలిటిక్స్ అర్థం కావు పాపం! నేనే జాలివేసి నిన్న చెప్పేను 'ఇదిలా జూనియర్ కాలేజీగా వుంటేనే నీకా గ్రాడెజ్ సింహాసనం! సీనియర్ కాలేజీ అయిందా—చూసుకో ఈ త్రిశంకు స్వర్గం నుంచి జారిన మీరూ నేనూ కలిసే డిపార్ట్‌మెంట్‌లో కూర్చోవచ్చు' అని! ఆ మాటలు విన్నప్పటి నుంచీ మేజోళ్ళో తేలు కుడుతున్నట్లు వొకటే యాతన పడతాడేతప్ప పైకి పిసరంత కక్కడు! అమ్మో — గరికయ్యంటే గుర్రూకి నరనరాల్లోంచీ ఎంత వణుకని! సారీ—వొస్తానండీ మేట్నీకి టైమైపోతుంది—రేపు కలుద్దాం'' అంటూ భాస్కరాచారి వెళ్ళిపోయేడు.

అవాళ రాత్రి ఇంటికొచ్చిన అంకాలికి వో కాగితాన్నిస్తూ వెంకట్రామయ్యగారు ''ఈ కాయితాన్ని సైన్స్ లెక్చరర్‌గారికి చూపించి; జాగ్రత్తగా చదవమన్నాననీ, ఏమన్నా మార్పులూ చేర్పులూవుంటే చేయమన్నాననీ చెప్పు. తరవాత వాళ్ళబ్బాయిచేత మూడు కాపీలు టైపు చేయించిపెట్టమను. ఈ కాగితంమాత్రం ఆ మేష్టారి దగ్గరే వొదిలేసి, టైపు చేస్తారు చూడు ఆ మూడు కాయితాలూ తీసుకొని, రేపు తలుపులుతోబాటు కాలేజీకి రా. మీటింగులో మంత్రిగారికి అందరూ వినతి పత్రాలని కాయితాలిస్తుంటారు చూడు అప్పుడు మీరిద్దరూ కలిసి స్టేజిమీదకెళ్ళి దణ్ణం పెట్టి మంత్రిగారికో కాయితం, గరికయ్య, సర్పంచ్‌లకి మిగతావీ ఇచ్చేయండి. పోలీసులూ ఇంకా ఎవరైనా మిమ్మల్ని అటకాయించి ఏమిటూ కాయితాలన్నా మీరేం చెప్పక్కర్లేదు.

ఈ కాయితంలో వ్రాసిందంతా నీ మేనల్లుడు తలుపుల్ని పిలిచి నేను చెప్పేను. వాడొప్పుకున్నాడు. మరి నువ్వు స్వీపర్ పోస్ట్‌లో వుంటూ గుడిసె కావాలంటే వొప్పుకోరు. అంచేత తలుపులే తాను నైట్ వాచర్ గాబట్టి ఇల్లు కావాలనీ, వాలీబాల్ కోర్టుకటు వారగా గోడకానుకొని గుడిసె కట్టుకోడానికి ఆర్డర్ద్వారా అనుమతించమనీ మంత్రిగారిని ప్రార్థిస్తున్నట్లుగా ఈ కాయితం వ్రాసేను. అలా ఆర్డరంటూ వచ్చేక నువ్వే ఇల్లు కట్టుకొని వుంటావు—ఏమంటావ్!'' అన్నారు.

''సానా బాగున్నాదండి. తలుపులు నా యింటోనే ఎదిగినాడు కదేటండి. ఆడికి నానంటే సానా ఆపేచ్చున్నాది నెండి'' అంది అంకాలు కాగితాన్నందుకొంటూ.

''మరి వెళ్ళు. ఆ పనులన్నీ చక్కబెట్టుకో. పనయ్యేవరకూ మా పేర్లు బైటకి రానీయకు'' అన్న వెంకట్రామయ్య మాట కడ్డొస్తూ —

''అదేటిబాబూ—నాకు తెల్దేటండి—నాను సచ్చి మీ కడుపున పుడతానండి-ఎల్తాను'' అని నమస్కారంచేసి అంకాలు వెళ్ళింది.

మర్నాడు హోమీబాబా ద్వారంవద్ద ఎదురుచూస్తున్న జనం దూరంగా మంత్రిగారి కారు చూడ్డంతో చటుక్కున రోడ్డు కటూ యిటూ తప్పుకొన్నారు.

మంత్రి కారు దిగేరు—ఏ వొక్కరూ తన దగ్గరకి రావడం గానీ, కనీసం నమస్కరించడంగానీ చేయకపోవడంతో వో క్షణం ఇబ్బందిలో పడ్డారు.

ఇంతట్లోనే 'స్టార్ట్' అని వినిపించడం, ద్వారం స్తంభాల వెనకనుంచి ఛటాలున వచ్చిన ఆడపిల్లలు రెండు లైన్‌లలో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్ అంటున్న ''వన్ టూ—త్రీ ఫోర్-ఫైవ్ సిక్స్—సెవెన్ యైట్; యైట్ సెవెన్—సిక్స్‌ఫైవ్—ఫోర్‌త్రీ—టూవన్'' అనే మాటలకి లయబద్ధంగా యూనిఫారంలో వున్న తాము అటూ ఇటూ వొంగి లెజిమ్ము కొడుతూ చరచరా మంత్రి కెదురుగా వొచ్చేరు. వాళ్ళ మధ్యగా కిరీటంతో రాణీవేషంలో వున్న అమ్మాయి మినిష్టరుగారి దగ్గిరకొచ్చి, యువరాణి అందించిన వెండిపళ్ళెంతో వారికి హారతిచ్చి, పూలమాల వేసింది. యువరాణులూ, రాణీ పళ్ళేల్లోంచి వొయ్యారంగా తీసి పూలరేకుల్ని నేలపై జల్లుతుండగా మధ్యగా మంత్రిగారు మెల్లగా అడుగులు వేస్తూ వొస్తున్నారు. అటూ ఇటూ లెజిమ్స్ కొడుతూ వెనుతిరిగి పిల్లలు చర చర వొస్తున్నారు.

ఎంత నిగర్వికైనా ఇలాంటి తంతు జరుగుతుంటే కొంచెం బుఱ్ఱ ఎగరేస్తూ మరీ నడవాలనిపించి తీరుతుంది!

ఈ వింత స్వాగతానికి మంత్రిగారు గొప్పగా ప్లీజై చిరునవ్వుతో ముందుకు సాగి వొస్తున్నారు—ముకుళిత హస్తాలతో అందరి నమస్కారాల్ని అందుకొంటూ. ఫ్లాష్ కెమేరాలు తెగ మెఱుస్తున్నాయి.

కాలేజీ దగ్గరున్న రామన్ ద్వారం దగ్గిర కొందరు బ్రాహ్మణులు చేతుల్తో పూర్ణకలశాలని పట్టుకొని — ''ఓం స్వస్తిర్మానుషేభ్యః'' అని మంత్రాలు చదువుతూ ఎదురొచ్చి, కలశోదకాన్ని మంత్రిగారిపై సన్నగా మామిడాకుల్తో ప్రోక్షిస్తూ, పువాదులదాకా తీసుకువెళ్ళి, అక్కడ షామియానాక్రింద ఓ చిత్రాసనంమీద మంత్రిగారిని కూర్చోబెట్టి, సంకల్పం చేయిస్తున్నారు.

కుర్చీ వరసలలో మధ్యగా కూర్చొన్న వెంకట్రామయ్యగారి బుజంపై వెనకనించి మెత్తగా తట్టి, తనవైపు తిరగ్గానే కళ్ళతో 'బైటికిపోదాం' అని భాస్కరాచారి సంజ్ఞ చేసేరు.

ఇవతలి కొచ్చేక "అలా వెళ్దాం రండి" అని ముందుకు నడుస్తూ, స్టూడెంట్ తెచ్చిన సిగరెట్ పేకెట్టు అందుకొని థాంక్స్ చెప్పి, హైస్కూలు వెనకాతలకి వెంకట్రామయ్యని తీసుకుని భాస్కరాచారిగారు వెళ్ళేరు.

రాసుసిరి చెట్టుకొమ్మ నానుకు సిగరెట్ వెలిగించి వెంకట్రామయ్యగారికి సిగరెట్ అందిస్తూ భాస్కరాచారి మొదలుపెట్టేరు—

"అవునండీ—ఎందుకండి ఆ రాతలు?! ఆ కాయితంపై సదరు మంత్రివరేణ్యుడు ఏ ఏక్షన్ తీసుకొన్నా తీసుకోకపోయినా—మన ప్రెసిడెంట్ సర్పంచ్‌లు మాత్రం మిమ్మల్నో భరతం పట్టిస్తేగాని వో పట్టాన వొదలరు తెలుసా!"

"బాగుంది—వాళ్ళెవరో భరతం పట్టిస్తారేమోనని భయపడి ఈ అన్యాయాన్ని అందునా-పాపం దాని కొంప పీకేసి, చాపా ముంతా వీధిని గిరాటేస్తే చూస్తూ కూర్చోడం ఏం ధర్మం చెప్పండి" అన్నాడు వెంకట్రామయ్య బిగించిన పిడికిట్లోంచి పఫ్ లాగబోతూ.

"ఐ మీన్—నా అభిప్రాయం అదికాదు. ఇలా కాయితాల్తో మీరనుకొన్నది ఏం సాధిస్తారని! వూరకే బైటపడిపోయి—వాళ్ళ చిర్రుబుర్రు కోపాలకి మీరు గురవడం తప్ప మరేంకాదు. అయినా ఈ సర్పంచ్ తనకు లొంగని అంకాలికి ఈ వీలు దక్కనిస్తాడనా మీ నమ్మకం!"

"నేను అంకాలు వ్రాసుకొన్నట్టుగా కాయితాన్ని రాయలేదే! తలుపులే ఇల్లు కావాలంటాడు. ఆ ఇంట్లో అంకాలుంటుంది."

"వూరుకోండి మేష్టారూ—మీరు మరీను! ఈ పొలిటికల్ బ్రైన్స్‌కి మీ ఆలోచనలు అర్థం కావనుకొన్నారా? అంతెందుకు? అంకాలిని ఇంట్లోంచి తగిలేసినప్పుడే అది ఎవరెవరి దగ్గరికి సలహాకి పోతుందో కూడా వాళ్ళకి తెలుసునంటే మీరు నమ్మగలరా!"

"అయితే—దాని ఖర్మాన దాన్ని వొదిలేయడమేనా వీళ్ళకి భయపడి!"

"ఏం వొదలక్కరలేదు—హాయిగా వో వారందాకా —అంటే మన కాలేజీలో పరీక్షలు స్టార్టయేవఱకూ కూతురింట్లో వుండి; తరవాత గప్‌చిప్‌గా మునపటిచోటే వో పాక లేపి; హాయిగా ఈ కొంగ్రొత్త చంద్రశిలా ఫలక స్థగిత కుడ్యాన్ని తనింటికి వో ప్రక్క గోడగా మలుచుకొని మరీ సుఖంగా వుంటుంది!"

"అదేవిటి? అక్కడ లేబరేటరీ—అదేలెండి — మొత్తంమీద ఏదో వొకటి కట్టేయబోతున్నారుగా!"

"కట్టేయబోతుంటే అంటారేవిటండీ? కట్టేస్తేను! ఆ చంద్రశిలాఫలకం వున్న దిమ్మ కట్టేసేరా లేదా?! అంతే—దట్సాల్!"

దూరంగా చప్పట్లూ, మైక్‌లోంచి ప్రిన్సిపాల్ చదివే స్వాగతపత్రమూ విన్పిస్తున్నాయి.

"అంతే మేష్టారూ—మరేంలేదు! అనవసరంగా మీరేమాత్రం వర్రీ అవకండి! వారం రోజుల్లో పరీక్ష లౌస్తున్నాయి. ఆపైన సెలవులుకదా! అంకాలు లేపబోయే గుడిసెపై ఎవరైనా దృష్టి త్రిప్పడానికే మూణ్ణెల్ల పైచిలుకు పడుతుంది. ప్రిన్సిపాల్‌కి ఇలాంటి విషయాల్లో చీమ కూడా కుట్టదన్న సంగతి మీకు వేరే చెప్పక్కర్లేదు. అది మళ్ళా గుడిసె లేపేసరికే మన ముష్కరుడి ప్రాణాలు పైకి పోతాయి—అలాంటిది దానితో మాట్లాడ్డమే! ఇక ఒకవేళ సర్పంచ్‌దృష్టిపడినా—ఇప్పుడు తాను దగ్గిరుండి పొమ్మంటే కదా అప్పుడు 'ఎందుకొచ్చేవ్ మళ్ళా' అని అనడానికి! పైగా మీకూ నాకూ ఝుడిసి వూరుకొంటాడు. ప్రెసిడెంట్‌కి మనం ఏవేవో వాడి గుట్లు చెప్పేస్తామని మనమంటే వూరకే తెగ బెరుకు. ఇక వొక వేళ అందరూ ఏకమై పాక పీకేస్తామన్నా — మనం వున్నాం—వూర్లో వాళ్ళు కొందరున్నారు 'ఏది ఆ మీరన్న భవన నిర్మాణాని కని వొక్కటంటే వొక్క బండెడు ఱాళ్ళూ, వొక్క బండితో సున్నమూ తెచ్చి అక్కడ పోయించండి! — మేమే దాని పాక పీకేసి, పీకపై చెయ్యేసి మరి బైటకి గెంటేస్తాం' అని చెప్పడానికి! — ఏవంటారు?"

అసలింతకీ అంకాలిని అప్పుడు ఈ సర్పంచూ, ఈ ప్రెసిడెంటూ పైకి అనకపోయినా లోపల ఎంత మెచ్చుకుంటారో వూహించండి?!— ఎందుకంటే—వాళ్ళకి అవసరం వొచ్చినప్పుడు మారుమాటాడకుండా గుడిసె తీసుకుపోయింది. తరవాత గుడిసె వేసుకొని ఇప్పటి ఆ చంద్ర శిలాక్షరాలు ఆ కర్మసాక్షికూడా కన్పించకుండాచేసి వాళ్ళ మర్యాద కాపాడుతుంది కదా! పైగా "ఏస్తె యేసుకున్నావు గానీ—వో నూరుకూడా ఆ తట్టున దించేసుకు యేడవరాదటే—ఆ సెందర సిలాపలకం కంపినీటుగా అవుపించకుండా—పోద్ది! ఆపైన నిదానంగా నీ పొయ్యి వున్నెమా అని దానికింత మందాన పొగట్టుకుపోయి మాకింత పరువు దక్కిస్తాది గందా!" అని తప్పకుండా అంకాలితో అని తీరతారు చూడండి!

"ఏవిటలా నిర్ఘాంతపోయి చూస్తున్నారు— పదండి పోదాం—వో సిగరెట్ తీసుకోండి!" అంటూ భాస్కరాచారి తనో సిగరెట్ వెలిగించుకొని; సంగోరుమూసిన తన దోసిట్లో వెలిగే అగ్గిపుల్లని అందించి వెంకట్రామయ్యగారి సిగరెట్ వెలిగించేరు.